
# పెద్దలు మారాలి



"వింధ్యవాసిని"

ఉత్సాహంగా ఇంట్లో అడుగుపెట్టిన నా సంతోష మంతా నీరు కారిపోయింది. 'అవును. నా సంతోషాన్ని పంచుకునే వాళ్ళెవరు?' అనుకుని నవ్వుకున్నాను. నాకు అందరూ ఉన్నారు. అయినా లేనట్లే కదూ? చెట్టంత నాన్నగారున్నారు. అయినా ఆయనకి మమ్మల్ని పరామర్శించేంత టయిము ఏదీ? ప్రాణంగా ప్రేమించే అమ్మ బ్రతికున్నా మాకు లేనిదే అయిపోయింది. చక్కగా చదువుకున్నాడు, మంచి ఉద్యోగం, ఇంట్లో నాన్నగారికి సహాయంకాగల అన్నయ్య ఉన్నాడు. అయితేనేం, వాడు ఏకంగా బార్‌లోనే కాపురం. డబ్బు అయిపోతే తప్ప ఇల్లు గుర్తురాదు. పదహారేళ్ళొచ్చినా పాలుగారే బుగ్గలున్న తమ్ముడున్నాడు. వాడికెప్పుడూ నాన్నగార్ని మోసంచేసి ఎలా డబ్బు గుంజాలా అనే ఆలోచనే తప్ప చదువూ, సంధ్యా కూడా పట్టవు. 'కాలేజీకి సరిగా వెళ్ళవేంరా' అని నిలదీశానంటే, ''నువ్వెవర్రా నన్నడగటానికి?'' అంటాడేమోకానీ, మెత్తగా అడిగినప్పుడు మాత్రం ''జానేదో భాయ్! ఈ చదువు మనకేలాగూ రాదు. కాలేజికెళ్ళి అనవసరంగా మాష్టర్లనిబ్బంది పెట్టడమెందుకు చెప్పు?'' అని తలఎగరేసి వెళ్ళిపోతాడు. ముగ్గురన్నయ్యల ముద్దుచెల్లాయి, యువరాణిలాంటి సుజాత వుంది. అది మరీ చిన్నపిల్ల. ఆడపిల్లయినా, ఇంట్లో పనిచేసే అలవాటులేదు. పని చేయమని చెప్పి నేర్పేవాళ్ళు లేకపోవటం మూలాన బాగా సోమరితనం. ఆ వయసు ఆడపిల్లల కుండాల్సినంత చురుకుతనమే లేదు. ఎక్కువ మాట్లాడదు. ఎప్పుడూ ఏదో ఒక చవకబారు పుస్తకం పట్టుకునుంటుంది. ఇదీ మా ఇంటి పరిస్థితి. దుఃఖమయితేనేం, సంతోషమయితేనేం ఇంక ఎవరికి చెప్పుకోవటం। చిన్నప్పుడే తోబుట్టువులంటే ప్రాణంపెట్టే ఓ అక్కయ్య ఉండేది. తను ఇప్పుడుంటే, ఈ పరిస్థితి కొంతయినా మెరుగ్గా ఉండేదేమో: కానీ తనూ అమ్మమీది బెంగతో జబ్బుచేసి, చిన్నప్పుడే మమ్మల్నొదిలేసి వెళ్ళిపోయింది.

యాంత్రికంగా డ్రస్ మార్చుకుని, వంటవాడిచ్చిన కాఫీ తాగి నా గదిలో మంచం మీద కూలబడ్డాను. నే తీసుకున్న నిర్ణయం సరయిందేనా, అని మళ్ళీ ఆలోచించటం మొదలుపెట్టాను.

ఈ రాత్రితో ఈ ఇంట్లో నా జీవితం ఆఖరు కావచ్చు. మళ్ళీ వస్తానో లేదో కూడా తెలీదు. ఎన్నాళ్ళుగానో, ఎంతో ఆలోచించే తీసుకున్నానీ నిర్ణయం. ఒక సంవత్సరంనించీ ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. రేపే, ఈ ఇంటినీ, ఈ వూరినీ వదిలేసి, మనసిచ్చిన అమ్మాయి చేయి పుచ్చుకుని, కొత్త జీవితాన్ని వెతుక్కుంటూ వెళ్ళబోతున్నాను. ఇలా చేయటంలో నేనేదో ఒక కులం లేని అనాథపిల్లకి సహాయం చేస్తున్నాననుకోవటంలేదు. ప్రేమించేటప్పుడు గుర్తురాని కులం, అంతస్తు ఇప్పుడెందుకు గుర్తురావాలి? ఇది పూర్తిగా నా స్వార్థమే; ఈ ఇంట్లో జీవితాన్ని నేనిక భరించలేను. ఈ వాతావరణాన్ని మార్చాలని నా కెంతో ఉంది కానీ నా వల్ల అయేదేమీ లేదని ఏనాడో తెలుసుకున్నాను. నాన్నగారి మనసులో ఏముందో ఆ భగవంతుడికే తెలియాలి. తెలుసుకునే అవకాశం మాకాయనెప్పుడూ ఈయరు. ఇంక

మిగతా ముగ్గురి బాధ్యత నే తీసుకుందామనుకున్నా. వాళ్ళకిదేమీ పట్టదు. ఎవరి దారి వాళ్ళదే. అలాంటప్పుడు ఈ ఇంట్లో వుండి మాత్రం చేసేదేముంది? అందుకే నా స్వార్థం నేను చూసుకుంటున్నాను. నా దారి నే వెదుక్కున్నాను. దురదృష్టంలోనూ అదృష్టంఅన్నట్లు, ఏమీలేకున్నా చక్కని సంస్కారం, మంచిమనసూ గల అమ్మాయికే మనసిచ్చాను. నా వల్ల ఏ ఉపయోగమూ లేని, ఈ ఇంట్లోవాళ్లకోసం నా సుఖాన్ని నే పోగొట్టుకోలేను. ఇలా ఆలోచించే, రేపు ప్రయాణం కట్టటానికి కావలసిన ప్రయత్నాలన్నీ చేశాను.

అయినా....అయినా....రక్తం పంచుకు పుట్టిన వాళ్ళనీ, జన్మనిచ్చిన తండ్రినీ వదిలి వెళుతున్నానంటే మనసంతా ఎలాగో అయిపోతుంది. కనీసం అమ్మనయినా మాతో తీసికెళ్ళాలని నేను చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. తనకి అదృష్టం వుంటే, ఎప్పుడో చచ్చిపోయేలోగా నాన్నగారి దగ్గరికే వొస్తాననీ, లేకుంటే అంతేననీ మంకు పట్టు పట్టిందావిడ.

ఆఖరి ప్రయత్నంగా నాన్నగారికి ఉత్తరం రాయాలని కూచున్నాను. ఎన్నాళ్ళుగానో, ఆయనతో ముఖాముఖీ చెప్పాలనుకున్నవన్నీ మనసు విప్పి రాయాలని ప్రయత్నం. ఎందుకంటే నాన్నగారి కిదే ఆఖరి ఉత్తరం కావచ్చు.

పూజ్యులు నాన్నగారికి,

రవీంద్ర నమస్కారాలు. మీరీ ఉత్తరం అందుకునేసరికి నేను మీనించి కొన్ని వందల మైళ్ళ దూరంలో వుంటాను. మీ మాట వినకుండా ఇలా వెళ్ళిపోయానని మీకు నామీదెంత కోపం వుంటుందో నాకు తెలుసు. కానీ నా మనసులో ఎన్ని ఆలోచనలున్నాయో, నా బుర్రలో ఎంత కల్లోలముందో, నా హృదయంలో ఎంత వ్యథవుందో నేను మీకెప్పుడూ చెప్పే అవకాశం రాలేదు. కనీసం ఈ ఒక్కసారి అయినా చెప్పనీయండి. మీ కొడుకుని కాబట్టి, మీ హృదయపు మూలలో అయినా నామీద కాస్తంత ప్రేమ వుంటుంది. దానివల్ల అయినా, మీరీ ఉత్తరాన్ని సాంతం చదువుతారనే ఆశతో రాస్తున్నాను.

అమ్మ పేరెత్తితేనే మీ క్కోపం వస్తుందని తెలుసు. అయినా ఆమెని గురించి రాయకుండా వుండలేను. నా చిన్నతనంలో అమ్మ మనతో వున్నప్పుడు తమ్ముడూ, చెల్లాయీ, అన్నయ్యా, అక్కయ్య మనమంతా ఎంత సంతోషంగా వుండేవాళ్ళమో మీకు గుర్తులేదా నాన్నగారూ?

అంత ఆనందమూ ఒక కలలా కరిగిపోయింది. అమ్మ వెళ్ళిపోవటంతో, కళకళలాడుతున్న ఇల్లు శ్మశానంలా అయిపోయింది. ఆ రోజు నాకిప్పటికీ గుర్తే. నాకప్పుడు పదేళ్ళుంటాయేమో. ఆ వేళ సాయంత్రం ఆటలు ముగించి ఇంటికొచ్చేసరికి ముందు గదిలో కూచుని ఏడుస్తూంది అమ్మ. మీ గది తలుపులు మూసివున్నాయి. "అమ్మా! ఎందుకమ్మా ఏడుస్తున్నావ్?" అని అడిగాను. నాకూ ఏడుపు వచ్చేస్తూంది, అమ్మ ఏడుస్తూంటే. మరోపక్క అక్కయ్య కూడా దిగులుపడి కూచుంది. "మీ నాన్నగారు ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నారు బాబూ!" అని మళ్ళా ఏడవసాగింది అమ్మ.

ఇంతలో మీ గది తలుపులు దఢాలున తెరుచుకున్నాయి. చేతిలో వున్న సూట్ కేస్‌ని బయటికి గిరాటు పెట్టారు మీరు. మీ కళ్ళు చింత నిప్పుల్లా వున్నాయి. 'వెళ్ళమని ఒకసారి చెబితే నీక్కాదూ? వెళతావా? నన్నే ఇంట్లోంచి పొమ్మంటావా?" అన్నారు వగరుస్తూ. మీకంత కోపం రావటం నేనెప్పుడూ చూడలేదు. అమ్మ అలా ఏడుస్తూనే సూట్ కేస్ పుచ్చుకుని అప్పుడే అలముకుంటున్న చీకట్లలో కలిసిపోయింది. అక్కయ్య, చెల్లాయీ ఏడుస్తూ అమ్మతోబాటే వెళ్ళబోయారు. కానీ అమ్మ రానియ్యలేదు. "వద్దమ్మా! నాన్నగారి దగ్గరే వుండాలి మీరంతా" అంటూ గబగబా వెళ్ళిపోయింది.

జరిగిందేమిటో అక్కయ్యకి తప్ప ఇంకెవరికీ అర్థం కాలేదు. అన్నయ్యా, తమ్ముడూ బయటినించీ వచ్చేదాకా ఏడుస్తూనే వున్నారు అక్కయ్యా, సుజాత. అలాగే మాకంతా భోజనాలు పెట్టిందక్కయ్య. ఆ రోజు, మీరూ, అక్కయ్య భోంచేయలేదు. చెల్లాయీ, సూర్యం—అమ్మా, అమ్మా అని ఏడ్చి ఏడ్చి నిద్రపోయారు. మీరు మూడు రోజులపాటు అన్నం, నీళ్ళు తాకలేదు. మా ముఖాలయినా చూడలేదు. అక్కయ్యే తనకి చాతనయినంత వండి అందరికీ పెట్టేది.

మూడో రోజుకి అక్కయ్యకి మూసిన కన్ను తెరవలేనంత జ్వరం వచ్చేసింది. ఆ వేళకి మీకు మా మీద దయ కలిగింది. వెళ్ళి డాక్టర్ని తీసుకు వచ్చారు. రెండు రోజులపాటు ఏవేవో మందులూ, ఇంజెక్షన్లూ ఇప్పించారు. అయినా లాభం లేకపోయింది. అక్కయ్య మనల్నందర్నీ విడిచి వెళ్ళి పోయింది.

చిన్నప్పట్నించీ మాకెవ్వరికీ మీదగ్గరంత చనువులేదు. మీరు సీరియస్‌గా వుంటే ఎవ్వరమూ మాట్లాడలేము. అక్కయ్య కోసం మీరు గది విడిచి మా దగ్గరికొచ్చేసరికి ధైర్యంచేసి సుజాత అడిగింది. "అమ్మ ఇంక రాదా నాన్నగారూ!" అని. "హుం! అమ్మ మంచిది కాదమ్మా. అందుకనే పంపేశాను. ఆ కసితో అక్కయ్య ప్రాణాలుకూడా తీసుకుంది చూశావా? పోనీలే అమ్మతో మనకేం పని? మనమంతా హాయిగా వుందాం. మీకేం కావాలన్నా నన్నడగండి. కానీ అమ్మను గురించి ఎప్పుడూ ఎవరూ అడగద్దు" చివరి మాటలు మిగతా అందర్నీ ఉద్దేశించి కాస్త గట్టిగా అన్నారు మీరు. అంతే ఆ రోజుతో 'అమ్మ' అనే మాటే ఆఖరు. ఎవరికి వాళ్ళమే లోలోపల ఎన్నిసార్లో అమ్మనిగూర్చి తలచుకున్నా. ఆలోచించుకున్నా పైకి మాత్రం మన్ను తిన్న పాములల్లే వుండిపోయేవాళ్ళం.

నలుగుర్లోకీ చెల్లాయే మరీ చిన్నది. మీరింట్లో వుంటే మీ భయానికోసం గొడవ చేసేదికాదు కానీ, మీరు ఏ కాంపుకో వెళ్ళినప్పుడు అన్నయ్యని వేపుకు తినేది—"అమ్మ కావాలీ" అంటూ. వాడూ ఏడుస్తూ కూచునేవాడు సుజాని పట్టుకుని. అయినా మీరు మళ్ళీ ఇంటికి రాగానే ఈగొడవలేమీ మీకు చెప్పేవాళ్ళం కాదు. కారణం మాతో ఎక్కువ మాట్లాడక పోయినా కావలసినవన్నీ తెచ్చిపెట్టే మీరు అమ్మ పేరెత్తితేనే మండిపడేవాళ్ళు. ఆ రోజంతా మా ముఖాలు చూడరిక. దాంతో నెమ్మదిగా మాకు అమ్మలేని జీవితం అలవాటు అయిపోయింది. కానీ సుజా[illegible] మాత్రం ఆషాక్ గట్టి ముద్రనే వేసింది. ఎప్పుడూ మందకొడిగా వుండేది. సాటి పిల్లలతో కలవటమనేది ఎప్పుడూలేదు. స్కూల్‌కి వెళ్ళి వచ్చాక ఒక్కతే ఇంట్లో దిగాలుగా కూచోవటం అలవాటు అయిపోయింది. అప్పుడూ, ఇప్పుడూ అంతే.

అమ్మని ఒకరకంగా త్వరగా మర్చిపోయినవాడు సూర్యమే. సరిగ్గా స్కూల్‌కెళ్ళకుండా ఆడుకోటం వాడికి ముందునించీఅలవాటే. అందుకోసం, అడ్డుపెట్టే వాళ్ళుకూడా లేక పోయేసరికి వాడికి మరీ విచ్చలవిడి అయిపోయింది. అప్పట్లో అమ్మ లేకపోవటమే మేలయిందని కూడా అనుకునే వాడేమో మరి.

ఇంక అన్నయ్య కాలేజీకి వెళ్ళేదాకా బాగానే


వుండేవాడు. మమ్మల్నందర్నీ ఎంతో శ్రద్ధగా చూసుకునే వాడు. అంతదాకా వాడికింకా ఆశ వుండేదనుకుంటాను ఎప్పుడో మీరు అమ్మను తీసుకొస్తారని. మాకందరికీ అలాగే చెప్పేవాడు. తన చదువయిపోయి, ఉద్యోగంలో చేరగానే అమ్మకోసం వెతుకుతాననీ, ఒకవేళ మీరు ఒప్పుకోకపోతే, మేమంతా అమ్మ దగ్గరికే వెళ్ళిపోవచ్చు అనికూడా చెప్పేవాడు.

కానీ ఒకరోజు ఉత్తరం ఒకటి వచ్చింది. మామూలుగా మీకు ఆఫీసుకే తప్ప ఇంటికి ఉత్తరాలు వచ్చేవికాదు. అందుకని ఏమయ్యుంటుందో అనే కుతూహలంతో తడిచేసి ఉత్తరాన్ని విప్పి చదివాము నేనూ, అన్నయ్యా. అందులో ఇలావుంది.

బావగారికి,

ఆవేళ మీరన్నట్లు నేను మనిషిని కాదు—జంతువునే, మూర్ఖుడినే. కల్లాకపటం ఎరుగని మీ చెల్లెల్ని అనవసరంగా అనుమానించి ఆమె చావుకి కారణమయ్యాను. దానివల్ల నేనెంత నష్టపోయానో, చేసిందానికెంత కుమిలిపోతున్నానో మీకు తెలీదు. నేను మూర్ఖుడినే పోనీయండి. ఎంతో సంస్కారంగల మీరు, నా తప్పుకి మా అక్కయ్యకి శిక్ష విధించారు. ఇంట్లోంచి పంపించేశారు. నేను చేసిన అన్యాయం ఒక పక్కనుండగా, మీరు చేసింది న్యాయమేనా అని అడిగే ధైర్యం నాకులేదు. కానీ నా అన్యాయానికి బలి అయింది మీ చెల్లెలు మాత్రమే. అయితే మీరు మా అక్కనీ, పిల్లల్నికూడా మీ కోపానికి గురి చేశారు. నన్ను క్షమించి, మా అక్కయ్యని తీసికెళ్ళమని ఎన్ని ఉత్తరాలు రాశానో లెక్కలేదు. మీరొక్క జవాబూ రాయలేదు. మా అక్కయ్య చదువుకుంది. ఉద్యోగం చేసి బ్రతకగలదు—నేనున్నా లేకున్నా. కానీ ఆమెకి మీరన్నా, పిల్లలన్నా ఎంత ప్రేమో మీకు తెలియంది కాదు. పోనీ అసలు మనిషే పోయాక ఇన్నిరాసి ఏం లాభం?

ఇన్నాళ్ళూ మీపై ఆశతోనే బ్రతికుందేమో మా అక్కయ్య మొన్ననొకసారి మీరీ జన్మకిక తన ముఖం చూసేది లేదని రాసిన వుత్తరం చూసి, ఏమి అనుకుందో తెలియదు. ఆత్మహత్య చేసుకోబోతున్నానని ఉత్తరం రాసిపెట్టి మూడు రోజుల క్రితమే వెళ్ళిపోయింది. తర్వాత రైలు కింద శవం దొరికింది. మీకు రాసినా మీరు రారని తెలుసు. అందుకనే రాయలేదు. భార్యని చేజేతులా




పోగొట్టుకున్నాను. అక్కయ్యా వెళ్ళిపోయింది. ఇంక నేచేసేదేముంది? అందుకని ఏ ఆశ్రమంలోనో చేరాలని వెళ్ళిపోతున్నాను. మిమ్మల్నిక ఉత్తరాలు రాసి విసిగించను.

ఇట్లు
రంగారావు

ఉత్తరం చదవగానే పిచ్చివాడిలా అయిపోయాడు అన్నయ్య. ఆ ఉత్తరం మీ టేబిల్ మీద ఉంచాలని కూడా వాడికి గుర్తు రాలేదు. గమ్ పెట్టి అతికించి నేనే మీ గదిలో వుంచి వచ్చాను.

"అయిపోయిందిరా. అమ్మ వెళ్ళిపోయిందీ లోకం నించే" అని నన్ను కరుచుకుని ఏడుస్తున్న అన్నయ్య నాకు చిన్నపిల్లాడిలా కన్పించాడు. "అమ్మా! ఎందుకిలా చేశావమ్మా? మేం నీదగ్గరికొచ్చే దాకా అయినా వుండలేకపోయావా?" అనుకున్నాను లోలోపలే కుమిలిపోతూ.

ఆవాళ రాత్రి ఇంటికొచ్చిన మీరు ఆ ఉత్తరాన్ని ఒకే ఒక్కసారి చదివి, ఎటువంటి ఫీలింగ్‌నీ ముఖంలో చూపించక, చించి చెత్తబుట్టలో పారేసారు. ఆ క్షణంలో అన్నయ్య చూపులకీ, కోపానికే గనక శక్తి వుంటే మీరేమయి పోయేవారో! మేమీ విషయాలేవీ తమ్ముడికీ, సుజాకీ చెప్పలేదు. అంతా మా ఇద్దరి మధ్యా దాచేసి, దుఃఖాన్ని దిగమింగుకున్నాం.

అమ్మ పేరే ఎత్తొద్దని మమ్మల్ని శాసించారు గానీ, మా మనసుల్లో లేకుండా చేయగలిగారా నాన్నగారూ? అసలు మరిపించటం కోసం, ఎప్పుడయినా మీరుగా ప్రయత్నం చేశారా? అలా అంటే 'మీకు నేనేం లోటు చేశాను?' అంటారేమో? మీరు మాకు చేసిన లోటేమిటో మీకెప్పటికీ అర్థం కాదు—మీరు అర్థం చేసుకోవాలని ప్రయత్నించరు కనుక.

ఆ వేళ నాకింకా బాగా గుర్తే. అన్నయ్య బి. ఏ. పేసయ్యాడు. వెంటనే చెప్పటానికి మీరు వూళ్ళో లేరు. తిరిగి రాగానే చెప్పాడు. వాడు పాసయాడంటే, మీలో తండ్రిగా వుండాల్సిన సంతోషం కించిత్తు కూడా కనిపించలేదు. అమ్మ వెళ్ళిపోయాక మీ మనసెంత రాయిలా అయిపోయిందో నాకా రోజు అర్థమయింది. కనీసం అన్నయ్య ముఖంలోకి అయినా చూడకుండా, "సరే మంచిది, ఇంకా చదువుతావా? ఉద్యోగమా?" అన్నారు ఎవరో బయటివాడిలాగా. దాంతో అన్నయ్య ఎంత నిరుత్సాహపడిపోయుంటాడో నేను అర్థంచేసుకోగలను. తలవంచుకుని, "ఉద్యోగమే చేస్తాను నాన్నగారూ!" అన్నాడు నెమ్మదిగా.

మీరు చాలా పెద్ద ఆఫీసర్. తలచుకుంటే మీరు చేయలేందిలేదు. నెలతిరిగేలోగా అన్నయ్యకి ఉన్న వూళ్ళోనే మంచి ఉద్యోగం అయింది. మంచి రోజు చూసుకుని అన్నయ్య ఉద్యోగంలో చేరాడు. మీరు ఆఫీసునించి ఇంకా రాలేదు. సాయంత్రం ఇంటికి వచ్చి అన్నయ్య కోసం చూస్తున్నాను.

మొదటిరోజు ఉద్యోగపు అనుభవాలు చెబుతాడనే ఉత్సాహంతో. రాత్రి పదిగంటలయినా మీరూ రాలేదు, అన్నయ్యా రాలేదు. సుజా, సూర్యం భోంచేసి నిద్రపోయారు.

గంట పదకొండవుతుండగా, అన్నయ్య వచ్చాడు. వంటవాడు కూడా నిద్రపోతున్నందువల్ల నేనే తలుపు తీశాను. ఎదురుగా వున్న అన్నయ్య పరిస్థితి చూసి నాకు కళ్ళు తిరిగినట్లయింది. నలిగిన బట్టలూ, ఎర్రనయిన కళ్ళతో నన్నే చూస్తూ, "నాకే అనుకున్నా, నీక్కూడా కళ్ళుతిరుగుతున్నాయట్రా రవీ!" అన్నాడు మత్తుగా. నాకేం చేయాలో పాలుపోలేదు. నెమ్మదిగా లోపలికి తీసుకువెళ్ళి ముఖం కడిగించాను. కాస్త మజ్జిగ తాగి నెమ్మదిపడ్డాక, అడిగాను "తాగొచ్చావా అన్నయ్యా" అని.

"ఏదోరా కొలీగ్స్ అంతా పార్టీ ఇమ్మంటేనూ" అంటూనే ముసుగు తన్నేశాడు అన్నయ్య. ఆ రోజుతో—అమ్మ పోయినప్పట్నించీ నాకూ అన్నయ్యకూ మధ్య పెరుగుతూ వచ్చిన ఆత్మీయత కాస్తా అంతరించిపోయింది. పార్టీ కోసం తాగిన అన్నయ్యకి అలవాటుకోసం తాగటం తప్పనిసరి అయిపోయింది. ఇంక ఆపైన వాడు ఇంట్లో కనిపించటమే కష్టమయిపోయింది.

అప్పటికే తమ్ముడూ, చెల్లాయీ నా ఊహకి అందకుండా పోయారు. సూర్యం సంగతి మీకు తెలియందేముంది? మొదటినించీ అడిగినంత డబ్బు చేతికి రావటంతో వాడికి స్కూల్‌కి వెళ్లటం, చదువుకోటం అనేవి అలవాటు లేకుండానే పోయాయి. ఇంక చదువెలాగూ రాదు. ఏదైనా వేరే వ్యాపకం పెడితే మంచిదేమో అని నేనూ, అన్నయ్యా అనుకున్నాం. ఒకసారి మీతో చూచాయగా అంటే, 'వాడిమొహం స్కూల్‌ఫయినల్ అయినా గట్టెక్కందే వాడికేం చేతనవుతుంది?' అని కొట్టిపారేశారు మీరు. కానీ జీవితమంతా చదివినా స్కూల్ ఫయినల్ పాస్ కాలేడనీ, ఆ విషయం మీరు తెలుసుకునేసరికి, వాడు మీ దృష్టికి అందడనీ మీకు తెలీదా నాన్నగారూ!

ఈ ఇంట్లో నాకు దగ్గరగా కనీసం అన్నయ్య అయినా వున్నాడనుకునేవాణ్ణి. ఆ ఆశ వమ్ము అయ్యేసరికి నేను నీరు కారిపోయాను. సరిగ్గా అలాంటి పరిస్థితిలోనే నాకు కస్తూరితో పరిచయం అయింది. ఆ అమ్మాయి అనాథ. కులం ఏమిటో ఆమెకే తెలీదు. పుట్టినప్పట్నించీ అనాథ శరణాలయంలోనే పెరిగింది. డిగ్రీకోర్సు ముగిసే ముందు ఆమెతో అయిన పరిచయం, ఎం. ఎస్సీ అయ్యేసరికి, పెళ్ళి చేసుకోవాలనే కోరికగా పరిణమించింది. ఈ ఇంట్లో, మీ సంతానంలో అదృష్టవంతుణ్ణి నేనే అనుకున్నాను. మిగతా వాళ్ళు తలోదారి అయిపోయినా నేను ఏదో కాస్త చదవగలిగాను. చివరికి నన్ను, నా మనసును అర్థం చేసుకుని, నా మనసును దిద్దగల అమ్మాయికే మనసిచ్చాను. ఇంతమందీ ఇన్ని దార్లయినా, ఏమీ పట్టించుకోని మీకు నా విషయం మాత్రం పట్టింపుకొచ్చింది.

---

కర్పూరానికి ఎన్నో ఉపయోగాలున్నాయి. అది మందుగా కూడా పనికివస్తుంది.

*పళ్ళనొప్పి ఉన్నవారు కర్పూరాన్ని మిరియాలతో కలిపి పొడి చేసి నొప్పి పుట్టే పంటి మీద ఉంచితే నొప్పి తగ్గుతుంది.

*మామూలు తలనొప్పితో బాధపడేవారు అరిచేతిలో కొద్దిగా కొబ్బరినూనె తీసుకుని అందులో కాస్త కర్పూరాన్ని వేసి బాగా రాచి, అలా వచ్చిన ముద్దను తలకురాస్తే తలనొప్పి తగ్గగలదని పెద్దలు చెబుతారు. బెణుకులకు కూడా ఇది మంచి మందు.

*జలుబు ఎక్కువై ఎడతెరపి లేకుండా ముక్కు మంచి నీరు కారడాన్ని నివారించడానికి కర్పూరాన్నీ వల్లజీలకర్రనూ కలిపి పొడి చేసి సన్నటి గుడ్డలో ఉంచి మూటలా కట్టి వాసన చూస్తే చాలు.

*వామును నీళ్ళలో వేసి కాచి, ఆ సారాన్ని వడిగట్టి తీసి కొబ్బరినూనెతో చేర్చి అందులో కర్పూరం వేసి బాగా కాచి తీసి ఉంచి 'కర్పూరతైలం' తయారు చేసుకోవచ్చు. ఈ తైలం వాతం, కీళ్ళవాపు, నడుమునొప్పి, ఊపిరికుట్టు వంటి వాటికి మంచి మందుగా పని చేస్తుంది.

---

"ఏమిట్రా? ఆ దిక్కులేని పిల్లతో తిరుగుతున్నావటగా? నీకేం ఖర్మొచ్చింది? అయినా ఆ పిల్లలో ఏం చూశావురా నువ్వు? దాంతోటి నీ పెళ్ళి చేస్తాననే ఆశమాత్రం పెట్టుకోకు" అన్నారు మీరొక రోజు నన్ను పిలిచి. మీరు మాట అన్నారంటే అది శాసనమే అని నాకు తెలుసు. కానీ మీ శాసనానికి తల ఒగ్గి నిలిచి, జీవించే శక్తి నాకు లేదు నాన్నగారూ! ఈ ఇంట్లో, ఈ జీవితంతో నేను విసిగిపోయాను. ఇలా అంటున్నందుకు నన్ను క్షమించండి.

ఆరు నెలల క్రితం కస్తూరిని పెళ్ళాడాలని నిశ్చయించుకున్నాక, వాళ్ళ శరణాలయం మేట్రన్ గారితో మాట్లాడాలని వెళ్ళాను. ఆమెని చూడగానే ఎక్కడో చూసినట్లనిపించింది. నా నిర్ణయాన్ని ఆవిడికి తెలిపాను. తరువాత కాసేపు మా ఫ్యూచర్ ప్లాన్స్ గురించి మాట్లాడుకున్నాము. మాట్లాడుతున్నంతసేపు ఆవిడ అదోలా చూస్తూంది—నావైపే. నా పేరు, చదువు తప్పనే నావిడకింకేం చెప్పలేదు.

హఠాత్తుగా, "మీ నాన్నగారెవరు? ఏం చేస్తుంటారు బాబూ" అంది. చెప్పాను. అనుమానంగా చూస్తూ, "నీకో అన్నయ్య, తమ్ముడు చెల్లాయీ వుండాలి కదూ?" అని అడిగింది. నాకు ఆశ్చర్యం వేసింది. తరవాత జరిగిన సంభాషణ వల్ల ఆవిడ మా అమ్మేనని తెలుసుకున్నాను. మనకు తెలిసినట్లు ఆవిడ చనిపోలేదు. జీవితం మీద విసుగేసి, ప్రాణాలు తీసుకోవాలని వెళుతుండగా ఒక మహానుభావుడు ఆమెను ఆపి, కర్తవ్య బోధ చేశాడట! ఆయన సహాయంతో, ఈ శరణాలయంలో పని సంపాదించి, ఆ పనితోనే చుట్టూవున్న అనాథ పిల్లల్లోనే తన పిల్లల్ని చూసుకొని సంతృప్తి పడుతున్నానని చెప్పింది. అమ్మని చూసిన సంతోషం నాలో అంతా ఇంతా కాదు. వెంటనే ఈ విషయం ఇంట్లో అందరికీ, లోకానికంతా చెప్పాలనిపించింది. కానీ అమ్మ నా కాళ్ళకు బంధంవేసింది. తనని మన ఇంటికి రమ్మని ఎంతగానో బ్రతిమాలాను. తనని ఎదురుగా చూస్తే మీ కోపం పోతుందని నా అభిప్రాయం. చేయని నేరానికి, తనని మీరు ఇంట్లోంచి గెంటేశారనీ, తనకిక ఆ ఇంట్లో చోటులేదనీ అంది. ఇంట్లో ఎవరికీ తను బ్రతికున్నట్లు చెప్పొద్దని ఒట్టేయించుకుంది. అసలు తను బ్రతికున్నట్లు మీకు తెలియటమే తనకిష్టం లేదంది. అమ్మ పేరెత్తితేనే మండిపడే మీతో ఈ విషయాలన్నీ ఎలా చెప్పాలో నాకు అర్థం కాలేదు.

నాకు ఉద్యోగం వచ్చాక, కనీసం నా దగ్గరకైనా వచ్చెయ్యమని ఎంతగానో బ్రతిమాలాను అమ్మని. కాపీ ఆవిడ ఒప్పుకోలేదు. తనకి జీవితమే ప్రశాంతంగా వుందని చెప్పింది. కానీ అవి మాటలేననీ, ఆమె మనసులో అగ్ని పర్వతాలున్నాయనీ, మిమ్మల్నీ, తన పిల్లల్నీ ఆవిడ మరిచిపోలేకుండా వున్నదనీ, నాకు ఆవిడని చూస్తేనే అర్థమయిపోయింది. అయినా నేను చేయగలిగేది మాత్రం ఏముంది!

వీడొచ్చి నాకు బుద్ధులు చెప్పేది ఏమిటి అని కోపం తెచ్చుకోకండి నాన్నగారూ! మీనుంచి ఎంతో దూరం వెళ్ళిపోతున్నాను. ఇంత రాశాను. ఇంకా కొన్ని మాటలు రాయనియ్యండి. కోపం లేకుండా చదవండి. మీరు చదువుకున్నవారు; ఇంత అనుభవం గలవారు. మీకు తెలియందేముంది నాన్నగారూ? మీకు మీ చెల్లెలంటే అపారమయిన ప్రేమే వుండొచ్చు. అది అతి సహజం కూడాను. కానీ మామయ్య చేసిన నేరానికి అమ్మని శిక్షించటం ఏం న్యాయం? అత్తమ్మ మరణానికి కారణమయిన మామయ్యమీద కసి తీర్చుకోవాలని, అమ్మని పంపించేశారు కానీ, దానివల్ల నష్టపోయింది మీరూ, మీ పిల్లలే! మీరు పగ తీర్చుకున్నది మామీద నాన్నగారూ—మీ రక్తం పంచుకు పుట్టిన మా మీద! ఇంతే! ఇంతకన్నా నేనేమీ రాయలేను. 'అమ్మను మళ్ళీ ఇంట్లోకి తీసుకురండి, అప్పుడు పరిస్థితులన్నీ చక్కబడతాయి' అని నేను చెప్పను. ఎందుకంటే ఇది మీరు ఆలోచించి తీసుకోవలసిన నిర్ణయమే కానీ, నా మాటల వల్ల ప్రయోజనం లేదు. ఉంటాను. ఉద్యోగంలో చేరగానే మళ్ళీ ఉత్తరం రాస్తాను. మీకు మామీద కోపం లేకపోతే, మళ్ళీ ఒకసారి ఇద్దరం కలిసి వచ్చి మీ ఆశీర్వాదం తీసుకుంటాం.

ఇట్లు

నమస్కారములతో

మీ కుమారుడు, రవీంద్ర

ఉత్తరం ముగించేసరికి రాత్రి గడిచి తెల్లగా తెల్లవారుతోంది. ఏడు గంటలకు మేము తిరుపతి బయలుదేరాలని నిర్ణయం. అక్కడ పెళ్ళి కాగానే, నేరుగా నేను ఉద్యోగంలో చేరవలసిన వూరికి ప్రయాణం. ఇదీ మాప్లాను. బస్‌కి టైమవుతుందని, ఉత్తరాన్ని నాన్నగారి గదిలో టేబిల్ పైన పెట్టి రెడీ కాసాగేను. ఆయన వూళ్ళోలేరు. ఎల్లుండిగానీ ఇంటికి రారు.

*

కళ్ళుమూసి తెరిచేలోగా, ఆరు నెలలు గడిచిపోయాయి....ఆరోజు ఉగాది. అందరికీ సంవత్సరాది. రైలు, బస్సు, రిక్షాలమీద ప్రయాణం ముగించి, కస్తూరితో కలిసి, తిరిగి మాఇంట్లో అడుగు పెట్టాను. నాన్నగారు వరండాలోనే కూచుని పేపరు చూస్తూ, అన్నయ్యతో మాట్లాడుతున్నారు.

మమ్మల్నిద్దర్నీ చూడగానే, సంభ్రమంగా లేస్తూ, "ప్రయాణం బాగా జరిగిందా బాబూ?" అని పలకరించారు. మా నాన్నగారిలో ఇంత నెమ్మదితనం ఎప్పుడొచ్చిందా అని వింతగా చూసి, తేరుకుని, కస్తూరితో కలిసి వారికి పాదాభివందనం చేసేలోగా, అన్నయ్య మా సామానులు లోపల పెట్టించాడు.

"మొత్తానికి గట్టివాడివిరా నువ్వు. అన్నయ్యకంటే ముందుగా గృహస్థువయి పోయావు. అసలు మేమంతా నీకింకా గుర్తుంటామా అనుకున్నా. ఫరవాలేదు. మా మరదలు నిన్నింకా పూర్తిగా మార్చెయ్యలేదన్న మాట!" అని హాస్యం చేయసాగాడన్నయ్య.

ఇంతలో సుజా, "అమ్మా! అన్నయ్యా, వదినా వచ్చారే" అని అరుస్తూ బయటికి పరిగెత్తి వచ్చి, కస్తూరి చేయి పట్టుకుని లోపలికి లాక్కువెళ్ళింది. నున్నగా తల దువ్వుకుని వేసుకున్న ఆ జడలూ, ఆ కొత్త బట్టలూ, ఆ మాటతీరూ, ఇదసలు మా చెల్లాయేనా అని కళ్ళు ఆర్పకుండా చూస్తున్న నా భుజం పైన ఎవరో చేయివేశారు. చూస్తే తమ్ముడు సూర్యం. గట్టిగా కౌగలించుకోవాలనిపించింది.

వంటింట్లోకి చూద్దునుకదా, కస్తూరి అమ్మ పక్కనే కూచుని అప్పుడే అమ్మకీ, సుజాకీ ఏవో కబుర్లు చెప్పేస్తోంది. అమ్మ ముఖంలోకి బెరుగ్గా చూశాను.

తల ఎత్తి చూసిన అమ్మ "ఆదేం బాబూ! అక్కడే నిలబడిపోయావేం? అమ్మ కొత్తగా కనిపిస్తూందా నీ కళ్ళకి" అంది చిరునవ్వుతో.

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "అవునమ్మా! అమ్మలాకాదు. సాక్షాత్తు అన్నపూర్ణలా కనిపిస్తున్నావు నాకు!" అనాలనుకున్నాను. అంతలో అన్నయ్యా, తమ్ముడూ, నాన్నగారూ ఒక్కొక్కరే నా వెనకాలే లోపలికొచ్చారు.

"ఒరేయ్ రవీ! నీ సలహా ఒకటి అడగాలిరా. తమ్ముడూ, నేనూ కలిసి ఒక వర్క్‌షాప్ పెడితే బావుంటుందనీ, ఈ ఉద్యోగం మానెయ్యమనీ వేపుకు తింటున్నాడ్రా వీడు. నాన్నగారు నీ సలహా తీసుకోమన్నారు. ఎలా వుంటుందీ అయిడియా? ఎక్కడ, అంటే ఏవూళ్ళో అయితే మంచిది, అన్నీ నీవే చెప్పాలి" అన్నాడు అన్నయ్య.

తర్వాత అందరం, ఆ విషయాన్నే చర్చిస్తూ వుండిపోయాం భోజనాలయేదాకా. □

పశ్చిమ గోదావరిజిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘ అధ్యక్షులు శ్రీ కె. పి. ఎస్. రాజు 'వనిత' స్వాతంత్ర్యదిన సంచిక తమకు చాలా సంతోషం కలిగించిందని పేర్కొంటూ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలు శిక్షలు అనుభవించిన పశ్చిమ గోదావరి వనితల వివరాలు పంపారు. ఆ వివరాలు ఇవి:

"శ్రీమతి కోటమర్తి కనకమ్మగారికి 1930 లో ఆరునెలలు, 1932లో ఏడాది శిక్షలు విధించారు. ఆమె రాజమంద్రి, వేలూరు జైళ్ళలో శిక్ష అనుభవించారు.

"పెనుమంత్రకు చెందిన శ్రీమతి కలిదిండి సూరమ్మ, ఆలమూరుకు చెందిన శ్రీమతి అల్లూరి భద్రమ్మ, తణుకుకు చెందిన శ్రీమతులు తల్లాప్రగడ సుబ్బలక్ష్మి, దేవులపల్లి సత్యవతమ్మ, కొవ్వలి కనకమ్మ, సత్తిరాజు శ్యామలాంబ, అద్దూరి నాగరత్నమ్మలకు 1930లో ఏడేసినెలల శిక్షలు, రూ. 200లు జరిమానా విధించారు. వీరిలో ఎవరూ జరిమానా చెల్లించకపోవడంతో మరి ఆరేసివారాలు శిక్ష అదనంగా అనుభవించారు.

"విప్పర్రుకు చెందిన శ్రీమతి పసల అంజలక్ష్మికి ఏడాది జైలు శిక్ష విధించారు. ఆమె వేలూరు జైలులో ఒక ఆడపిల్లను కన్నారు.

"ఏలూరుకు చెందిన శ్రీమతులు పి. పార్వతమ్మ, వేలంపాటి మాణిక్యమ్మ, ముల్పూరి చుక్కమ్మ, గంధం అమ్మన్నరాజా, గంధం రత్నమ్మ; తణుకుకు చెందిన శ్రీమతులు సత్తిరాజు మంగమ్మ, తల్లాప్రగడ వసుంధరమ్మ; శ్రీమతులు తల్లాప్రగడ సూర్యలక్ష్మి (భీమవరం), ఉద్దరాజు మాణిక్యాంబ (వాలమర్రు), కొటికలపూడి సరస్వతి (పూళ్ళ), పాలకోడేటి నాగరత్నమ్మ (తాడేపల్లిగూడెం), గోకరాజు వెంకాయమ్మ (బువ్వలపాలెం), కంభంపాటి మాణిక్యాంబ (నర్సాపురం) మొదలైనవారు 1932 లో 6 నెలల నుంచీ ఏడాదిదాకా జైలు శిక్షలు (రాజమంద్రి, వేలూరు జైళ్ళలో) అనుభవించారు.

"పెనుగొండకు చెందిన శ్రీమతి దేగల వెంకటరత్నమ్మ, జిన్నూరుకు చెందిన శ్రీమతి అల్లూరి అన్నపూర్ణమ్మ 1940–41లో వేలూరు, రాజమంద్రి జైళ్ళలో 6 నెలలనుంచీ 9 నెలలదాకా శిక్షలు అనుభవించారు."